శుక్ర వారం
24-02-2023
సంపుటి - 08,
సంచిక-261
పేజీలు - 4
వెల రూ. 5/-
Telangana
Andhra Pradesh

RNI NO: TELTEL/2016/73311

www.samasamajam.in

సమ సమాజం

SAMA SAMAJAM TELUGU DAILY

తెలుగు దిన పత్రిక

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Warangal, Medak, Karimnagar, Kammam, Vishakapatnam, Vijayawada, Ongole

శ్రీరామ రక్ష కెసిఆర్

కూలగొడుతాం..పడగొడతామంటున్న వారిని నమ్మొద్దు

- కాంగ్రెస్, బిజెపి నేతల తీరుతో రాష్ట్రంలో అశాంతి
- భూపాలపల్లి పర్యటనలో రేవంత్, బండిలపై కెటిఆర్ విమర్శలు

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి
ఎన్నికల వేళ ప్రజల్లోకి దూసుకెళ్లాలి
ఉమ్మడి జిల్లాలో మంత్రికెటిఆర్ పర్యటన
పలు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన మంత్రి

భూపాలపల్లి, ఫిబ్రవరి 23 (సమ సమాజం): కాంగ్రెస్, బిజెపిలపై మంత్రులు కెటిఆర్, ఎర్రబెల్లి దయాకర్ రావులు తీవ్రంగా మండిపడ్డారు. ఈ రెండు పార్టీల నేతలు పిచ్చిపట్టిన కుక్కల్లా ప్రజలపై పడ్డారని మండిపడ్డారు. గతంలో పదేళ్లు అధికారం ఇస్తే కరెంట్ కష్టాలు..మంచినీటి గోసను ప్రజలకు అప్పగించిన ఘనత కాంగ్రెస్ పార్టీదని మంత్రి కెటిఆర్ అన్నారు. ఇకపోతే కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి రాష్ట్రానికి ఏం చేసిందని మండిపడ్డారు. కాంగ్రెస్ పాలనలో కరెంటు, సాగునీటికి ఇబ్బందులు పడ్డామని.. ఇప్పుడు మళ్లీ ఆ దిక్కు మాలిన పాలన కావాలా అని కేటీఆర్ ప్రశ్నించారు. తెలంగాణలో మూడోసారి కేసీఆర్ సీఎం అయితే 4 కోట్ల ప్రజలకు లాభం ఉంటుందన్నారు.భూపాలపల్లి జిల్లాలో మంత్రి కేటీఆర్ పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో కెటిఆర్ మాట్లాడారు. భూపాలపల్లిలో జిల్లాలో రూ.276కోట్ల అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవం, శంకుస్థాపన చేసుకున్నామన్నారు. 'భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు నిండాయి. ఎంతో మంది ప్రధానులు, ముఖ్యమంత్రులు పని చేస్తూ వచ్చారు. తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు దేశంలో ఎక్కడన్నా అమలవుతున్నాయా ఆలోచించాలని కోరుతున్నానని అన్నారు. ఇవాళ తెలంగాణ అభివృద్ధి చూసి పక్క రాష్ట్రాల ప్రజల తెలంగాణలో కలవాలని తహతహలాడుతున్నది నిజం కాదా అన్నారు. మా దగ్గర రైతుబంధు 3లో

అత్యంత విషమంగా ప్రీతి పరిస్థితి

- ప్రత్యేక బృందం పర్యవేక్షణలో నిమ్స్‌లో చికిత్స
- ప్రీతి ఆరోగ్యం గురించి ఆరా తీసిని డిఎంఇ రమేశ్ రెడ్డి
- ఘటనపై వివరాలు అందాక చర్యల తీసుకుంటామని హామీ
- ర్యాగింగ్ జరగేలదని ఎలా చెబుతారు?
- వైద్య విద్యార్థిని ప్రీతి తండ్రి ఆవేదన

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (సమ సమాజం): సీనియర్ల వేధింపులు తాళలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వైద్య విద్యార్థిని ప్రీతి ఆరోగ్య పరిస్థితి అత్యంత విషమంగా మారింది. ప్రీతి అవయవాలు దెబ్బతినడంతో పాటు బ్రెయిన్ కూడా డ్యామేజ్ అయినట్లు వైద్యులు చెబుతున్నారు. ప్రస్తుతం ఐసీయూలో వెంటిలేటర్‌పైనే చికిత్స కొనసాగుతోంది. వరంగల్ 3లో

వీధికుక్కల తరలింపునకు ప్రత్యేక చర్యలు

తక్షణమే నిర్ణయాలు అమలు జరగాలి

అధికారులను కోరిన హైదరాబాద్ డెవలప్‌మెంట్ కమిటీ

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (సమ సమాజం): గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు శివారు మున్సిపాలిటీల పరిధిలో వీధి కుక్కల బెడదను నివారించడానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. దీంతో ప్రజలు కొంత ఊపిరి పీల్చుకునే అవకాశం వచ్చింది. అయితే ఈ ప్రక్రియను వీలయినంత త్వరగా ప్రారంభించి ప్రజలకు భరోసా కల్పించాలని హైదరాబాద్ డెవలప్‌మెంట్ కమిటీ ఛైర్మన్ కె. కాశీనాథ్ కోరారు. సమస్యలను తెలుసుకుని అందుకు చర్యలకు ఉపక్రమించాలన్నారు. నగరంలో పెంచుకునే కుక్కల వల్ల కూడా ప్రమాదాలు రాకుండా వారి యజమానుల నుంచి నో అబ్జక్షన్ సర్టిఫికెట్ తీసుకోవాలన్నారు. ఇదిలావుంటే గ్రేటర్‌తో పాటు శివారు మున్సిపాలిటీల పరిధిలో వీధి కుక్కల బెడదను నివారించడానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. వివిధ విభాగాల అధికారులతో కలిసి అర్వింద్‌కుమార్ ఉన్నత స్థాయి 3లో

కరీంనగర్ కలెక్టరేట్ నిర్మాణ పనులు

కార్పోరేట్ కార్యాలయం నిర్మించాలన్న స్మితా సబర్వాల్

కరీంనగర్, ఫిబ్రవరి 23 (సమ సమాజం): కరీంనగర్ లో నిర్మిస్తున్న ఇంటిగ్రెటెడ్ డిస్ట్రిక్ట్ ఆఫీస్ కాంప్లెక్స్ నిర్మాణాన్ని ఆధునిక హంగులతో అత్యద్భుతంగా తీర్చిదిద్దాలని రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శి స్మితా సబర్వాల్ అధికారులను ఆదేశించారు. గురువారం కరీంనగర్ పర్యటనకు వచ్చిన ఆమె ప్రస్తుత కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో నిర్మిస్తున్న ఇంటిగ్రెటెడ్ డిస్ట్రిక్ట్ ఆఫీస్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ 3లో

ఎంఐఎం అభ్యర్థి మీర్జా రెహమత్ బేగ్ నామినేషన్ దాఖలు

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (సమ సమాజం): స్థానిక సంస్థల ఎంఐఎం అభ్యర్థి మీర్జా రెహమత్ బేగ్ జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్, 3లో

అమెరికాలో మరోమారు మంచు తుఫాన్ 1500 విమానాల రద్దు

న్యూయార్క్, ఫిబ్రవరి 23 (సమ సమాజం): అగ్ర రాజ్యం అమెరికా మరోసారి మంచు గుప్పిట్లో చిక్కుకుంది. అమెరికా పశ్చిమ తీరం నుంచి గ్రేట్ లేక్స్ వరకు భారీగా మంచు తుపాను కురుస్తుండటంతో.. ఏకంగా 1500 విమానాలు రద్దు అయ్యాయి. పలు

3లో

అంధత్వ రహిత తెలంగాణ ప్రభుత్వ లక్ష్యం

- అద్భుతంగా కొనసాగుతున్న కంటి వెలుగు కార్యక్రమం
- 25 రోజుల్లో 50 లక్షల మార్కును దాటిన పరీక్షలు
- చివరి వ్యక్తి వరకు కంటి పరీక్షలను తీసుకెళతాం
- కెసిఆర్ లక్ష్యాన్ని విజయవంతం చేస్తున్న అధికారులు
- పరీక్షల నిర్వహణలో సిద్దిపేట ముందుందన్న మంత్రి హరీష్ రావు

3లో

బండి నేతృత్వంలోనే అసెంబ్లీ ఎన్నికల పోరు

పార్టీ హైకమాండ్ సంకేతాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (సమ సమాజం): రాష్ట్రంలో బీజేపీ సంస్థాగత ఎన్నికలు 2024లో జరగనున్నట్లు తెలుస్తోంది. అప్పటివరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా బండి సంజయ్ కొనసాగనున్నారని పార్టీ వర్గాల సమాచారం. పార్టీ ఇన్‌ఛార్జ్ తరుణ్ ఛుగ్ కూడా ఇదే విసయాన్ని ధృవీకరించారు. వచ్చే

3లో

పన్నీరు సెల్వంకు సుప్రీంలో షాక్

ప్రధాన కార్యదర్శిగా ఎడపాడికే పళని స్వామి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23 (సమ సమాజం): పన్నీరు సెల్వంకు సుప్రీంలో షాక్ తగిలింది. ఏఐఏడీఎంకే తాత్కాలిక ప్రధాన కార్యదర్శిగా ఎడపాడికే పళని స్వామి కొనసాగవచ్చునని 2లో

సంపాదకీయం

ఐటీ కంపెనీలకు ముకుతాడు వేసేదెలా ?

ఐటి ఉద్యోగాలు ఎండమావిలా తయారయ్యాయి. ఎప్పుడు ఊడుతుందో తెలియని ఉద్యోగంతో కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఏర్పడింది. ఉద్యోగాల తొలగింపులపై కంపెనీలు వ్యవహరిస్తున్న నిర్లక్ష్య వైఖరి కారణంగా వేలాది కుటుంబాల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. వరుసగా ఉద్యోగాలు తొలగిస్తూ పోతున్నారు. ఉద్యోగాలను ఆఫర్ చేసి..తీరా ట్రైనింగ్ పూర్తయ్యాక సగం జీతాలే ఇస్తామంటున్న కంపెనీల నిజాయితీ ఏమిటో తెలుస్తుంది. పెరుగుతున్న ధరలతో మార్కెట్‌లో ఇప్పటికే తీవ్ర సంక్షోభం నెలకొంది. ఈ క్రమంలో ఉద్యోగుల పట్ల సానుభూతితో వ్యవహరించి ..జీతాలు కొంచెం తగ్గించి లేదా బోనస్‌లు లాంటివి ఇవ్వకుండా వారికి ఉద్యోగ భద్రత కల్పించి ఉంటే ఆయా కంపెనీల నిజాయితీ నిలిచేది. కానీ ఉద్యోగాలు తొలగిస్తే ఆ కుటుంబాలు ఏమయిపోతాయన్న కనీస ఆలోచన లేకుండా...సామాజిక బాధ్యతను కంపెనీలు విస్మరిస్తున్నాయి. ఉద్యోగులను తొలగిస్తూ ఐటి సంస్థలు వరుసగా తీసుకుంటున్న నిర్ణయాలు ఆందోళన కలిగిస్తున్నాయి. సమాజంలో తీవ్ర అశాంతికి కారణమవుతుందన్న బాధను పట్టించుకోవడం లేదు. ఆయా దేశాల ప్రభుత్వాలు కూడా వీటిని పట్టించుకోవడం లేదు. ఇకపోతే ఉద్యోగాలు కోల్పోతున్న వారిలో అధిక సంఖ్యాకులు భారతీయులేనన్న విషయం మరింత కలవరాన్ని కలిగిస్తోంది. అయినా మనదేశంలో పాలకుల కు కూడా ఏమీ పట్టడం లేదు. వారిని ఎలా ఆదుకోవాలో అన్న ఆలోచన చేయడం లేదు. ఉక్రెయిన్ నుంచి వచ్చిన వైద్య విద్యార్థులకే దిక్కు లేదు..ఇక ఉద్యోగాలు పోయిన వారికి వారు అండగా నిలుస్తారన్న ఆశా లేదు. ఓ సంస్థ విడుదల చేసిన గణాంకాల ప్రకారం గతేడాది ప్రపంచవ్యాప్తంగా **965** కంపెనీలు **1.50**లక్షల మందిని ఉద్యోగాల నుంచి తొలగించాయి. గత నవంబర్ నుండి ఇప్పటి వరకు రెండు లక్షల మందికి పైగా ఉద్యోగాలను పోయాయి. **2023**లో కూడా ఈ తొలగింపు పక్రియ కొనసాగుతోంది. జనవరి నెలలో రోజుకు సగటున **3** వేల మంది ఉద్యోగాలు కోల్పోయారని అంచనా! ఇలా **166** ఐటి కంపెనీలు **65** వేల మందిని ఉద్యోగాల నుండి తొలగించాయి. అనేక చిన్నాచితక కంపెనీలతో పాటు అమెజాన్, గూగుల్, ఫేస్‌బుక్, ట్విట్టర్, మైక్రోసాఫ్ట్ వంటి దిగ్గజ ఐటి సంస్థలు కూడా ఉద్యోగులను సాగనంపే పక్రియలో పోటీ పడుతున్న తీరు ఆందోళన కలిగిస్తోంది. గత ఏడాది కాలంలో భారతదేశంలో ఉద్యోగాలు పోగొట్టుకున్న టెకీల సంఖ్య **22** వేల దాకా ఉంటుందని అంచనా. ప్రపంచ వ్యాప్తంగా వివిధ కంపెనీలు తొలగించిన వారిలో **40** శాతం మంది భారతీయులే అని వివిధ సంస్థలు తేల్చి చెబుతున్నాయి. రానున్న రోజుల్లో కోల్పోయే ఉద్యోగాల్లో నూ భారతీయులే అధికంగా ఉంటారని కూడా ఆ సంస్థలు పేర్కొంటు న్నాయి. అదే జరిగితే పరిస్థితి మరింత తీవ్రమవుతుంది. ఇప్పటికే అమెరికాలో ఉద్యోగాలు పోగొట్టుకున్న భారతీయ యువత పరిస్థితి గందర గోళంగా మారింది. దీనికితోడు హెచ్**1**బి వీసాల నిబంధనలు వారి పరిస్థితిని మరింత అయోమయానికి గురిచేస్తున్నాయి. **60** రోజుల్లో వేరే ఉద్యోగం చూసుకోవాలని లేనిపక్షంలో స్వదేశానికి వెళ్లిపో వాలని ఈ నిబంధన పేర్కొంటోంది. దీంతో వేలాదిమంది భారతీయ యువతీయువకులు దేశం కానీ దేశంలో ఉద్యోగాల వేటలో మునిగిపోయారు. ఇప్పుడిది సమాజంలో అశాంతికి కారణం కానుంది. గుడ్డిలో మెల్లలాగా వీటిలో కొన్ని సంస్థలు ముందస్తు నోటీస్‌తో పాటు, కొంత మేరకు పరిహారం ఇస్తున్నాయి. మరికొన్ని సంస్థలు అటువంటివేమి లేకుండానే లే ఆఫ్ కాగితాన్ని చేతుల్లో పెడుతున్నాయి. వర్క్ ఫ్రం హోమ్‌లో భాగంగా ఇళ్ల దగ్గర పనిచేస్తున్న సిబ్బందిని అత్యవసర సమావేశం పేరుతో ఆఫీసుకు పిలిచిన అమెజాన్ కంపెనీ తొలగింపు లేఖలను చేతుల్లో పెడుతోంది. ఇంతకన్నా దారుణం మరోటి ఉండదు. ఇలాంటి వారికోసం ఏం చేయాలో ప్రభుత్వాలు ఆలోచన చేయాలి. కొత్త ఉద్యోగాల కల్పనతో పాటు, వీరికి

భృతి కల్పించడంపై చర్యలు తీసుకోవాలి. ఇది కేంద్రం బాధ్యత మాత్రమే కాదు. కేంద్రంతో పాటు రాష్ట్రాలు కూడా ఉమ్మడిగా ఆలోచన చేయాలి. ఉక్రెయిన్ యుద్ధం కారణంగా కూడా ఆర్థిక సంక్షోభం పెరిగింది. ఆయాదేశాలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. మరోవైపు ప్రపంచాన్ని కుదిపేస్తున్న ఆర్థికమాంద్యం ఇప్పుడప్పుడే అదుపులోకి వచ్చే అవకాశం లేదని నిపుణుల అంచనా! ఈ నేపథ్యంలో కొత్త ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవడం ఎంత కష్టమో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఈ పరిస్థితులు మన దేశంలో ఉన్న వారి తల్లిదండ్రులను, కుటుంబసభ్యులను కూడా తీవ్ర ఆందోళన కు గురిచేస్తున్నాయి. ఉద్యోగాలు వెతుక్కుంటూ వెళ్లి స్థిరపడుతు న్నారని భావిస్తున్న తరుణంలో ఇక్కడి వారికి తీరని మానసికక్షోభను తెచ్చి పెడుతోంది. సంక్షోభ నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాల్సిన కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలకు ఉపక్రమించడం లేదు. కనీసం భరోసా ఇవ్వడం లేదు. ఆదుకుంటా మన్న ఉపశమన వాక్కులు కూడా రావడం లేదు. ఇంత పెద్ద సంఖ్యలో భారతీయ యువత విదేశాలలో రోడ్డున పడుతున్నా ఇంతవరకు ఒక్క సమీక్షా సమావేశం కూడా నిర్వహించకపోవడం ప్రభుత్వ బాధ్యతా రాహిత్యానికి నిదర్శనం. విదేశాల్లో ఉన్న భారతీయ యువతకు భరోసా కలిగించే చర్యలు చేపట్టాలి. అక్కడి ప్రభుత్వాల తో సంప్రదించి, నిబంధనల్లో మార్పులు చేసేలా ఒత్తిడి తీసుకురావాలి. దేశీయంగానూ కార్మిక చట్టాలను టెక్ కంపెనీలు అమలు చేసేలా కఠిన చర్యలు చేపట్టాలి. ఇలా చేయకుండా మిన్నకుంటే సమాజంలో అశాంతి ప్రబలుతుంది. కంపెనీలకు భారీగా రాయితీలు ఇస్తున్న ప్రభుత్వాలు ఉద్యోగాల తొలగింపుపై కంపెనీలను నిలదీయాలి. కఠిననిబంధనలు విధించాలి. లాభాలు తింటూ పోవడం కాదు..ఉద్యోగ భద్రత కల్పించాల్సిన బాధ్యత కంపెనీలదే అని స్పష్టంగా తెలియచేయాలి. ఇష్టం వచ్చినట్లుగా తొలగిస్తే వారికి అండగా ఉన్నామన్న విషయం గుర్తు చేయాలి. ప్రభుత్వాలే ఈ బాధ్యత తీసుకుంటే తప్ప సమస్యకు పరిష్కారం దక్కదు.

పృథ్విరాజ్ గోసుకొండ
ఎడిటర్

దేశానికి ఆదర్శంగా తెలంగాణ వ్యవసాయం

40 లక్షల ఎకరాలు పెరిగిన సాగు విస్తీర్ణం ● వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్ రెడ్డి

కరీంనగర్, ఫిబ్రవరి 23 (సమ సమాజం): ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యవసాయ రంగంపై తీసుకున్న నిర్ణయాల వల్ల రాష్ట్ర వృద్ధిరేటు గణనీయంగా పెరిగిందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు వ్యవసాయంపై రూ. 3.50 లక్షల కోట్లు ఖర్చు చేశామని, ఈ రంగం అభివృద్ధి చెందిన కారణం గానే రాష్ట్రం అభివృద్ధిని సాధించగలిగిందన్నారు. కేసీఆర్ కంటే భిన్నంగా ఈ దేశంలో ఏ నాయకుడు ఆలోచించ లేదని పేర్కొన్నారు. గురువారం కరీంనగర్ పర్యటనలో భాగంగా ఆయన మీడియాతో మాట్లాడారు. 2014 యాసంగిలో కేవలం 28.18 లక్షల ఎకరాల్లో మాత్రమే రాష్ట్రంలో పంటలు సాగు కాగా ఈ యాసంగిలో 68.08 లక్షల ఎకరాల్లో సాగైందని చెప్పారు. అప్పటికి ఇప్పటికి 40 లక్షలకుపైగా ఎకరాల్లో సాగు విస్తీర్ణం పెరిగిందన్నారు. వ్యవసాయరంగం ఇప్పుడు దేశానికి నమూనాగా మారిందన్నారు. ఇక్కడి పథకాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయన్నారు. వివిధ రాష్ట్రాలు మన పథకాల అమలుపై ఆసక్తి చూపుతున్నాని అన్నారు. కేసీఆర్ పాలసీలకు భిన్నంగా ఏం చేస్తారో చెప్పకుండా కొందరు పాదయాత్రల్లో వ్యక్తిగత దూషణలు చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ ఏర్పాటును వ్యతిరేకించిన వాళ్లకు ఇది అర్థం కాదని, చేతకాని నేతలు సభలు, పాదయాత్రలు చేస్తూ నిరాధార ఆరోపణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. మూడోసారిమళ్లీ ముఖ్యమంత్రిగా కేసీఆరే విజయం సాధిస్తారని ధీమాను వ్యక్తం చేశారు.

రేవంత్, బండిలు పిచ్చికుక్కలు

వారిని తరిమి కొట్టాలని పిలుపు ● ఘాటు విమర్శలు చేసిన ఎర్రబెల్లి

భూపాలపల్లి, ఫిబ్రవరి 23 (సమ సమాజం): టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి పై మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి ఒక బ్లాక్ మెయిలర్ అని ఆరోపించారు. తెలంగాణలో రెండు పిచ్చికుక్కలు తిరుగుతున్నాయంటూ.. రేవంత్ రెడ్డి, బండి సంజయ్‌లను ఉద్దేశించి ఆరోపణలు చేశారు. వీళ్లను తెలంగాణ రాష్ట్రం నుంచి తరిమికొట్టాలని సూచించారు. రేవంత్ రెడ్డి పక్కన ఉన్నోళ్ళంతా.. భూ కబ్జాలు, బ్లాక్ మెయిలింగులు చేసి గతంలో జైలుకు వెళ్ళివచ్చినవారే అని ఎర్రబెల్లి వ్యాఖ్యలు చేశారు. అసలు రేవంత్ రూ.500 కోట్లతో ఇల్లు ఎలా కట్టాడో చెప్పాలని ఎర్రబెల్లి దయాకర్ రావు ప్రశ్నించారు. మరోవైపు టీడీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డికి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి సవాల్ విసిరారు. తాను అక్రమంగా సంపాదించినట్లు రేవంత్ నిరుపిస్తావా అని ప్రశ్నించారు. ప్రజా జీవితంలో ఆస్తులు అమ్ముకున్నానని చెప్పారు. తాను అక్రమంగా ఆస్తులు సంపాదించినట్లు రేవంత్ నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానని గండ్ర తెలిపారు. తనపై పిచ్చి పిచ్చి ఆరోపణలు చేయొద్దన్నారు. అవినీతి పరులకు దేశ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి అని ఆరోపించారు. చంద్రబాబు ఏజెంట్ గా తెలంగాణలో చెలామణి అవుతున్నాడని విమర్శించారు. రేవంత్ తో తిరిగేవాళ్లంతా చంద్రబాబు బీ టీమేనని గండ్ర పేర్కొన్నారు. దమ్ముంటే భూపాలపల్లిలో పోటీ చేయాలని ఛాలెంజ్ చేశారు. నిన్ను చిత్తుగా ఓడిస్తా సవాల్ కు సిద్ధమా అని గండ్ర వెంకటరమణారెడ్డి రేవంత్ ను ప్రశ్నించారు.

పన్నీరు సెల్వంకు సుప్రీంలో షాక్

(మొదటి పేజీ తరువాయి) సుప్రీంకోర్టు గురువారం తీర్పు చెప్పింది. గతంలో మద్రాస్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. దీంతో ఆ పార్టీ సీనియర్ నేత ఓ పన్నీర్‌సెల్వంకు గట్టి ఎదురు దెబ్బ తగిలింది. హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న పన్నీర్‌సెల్వం, పళనిస్వామి మధ్య వివాదంపై ఈ తీర్పు ప్రభావం ఉండబోదని సుప్రీంకోర్టు తెలిపింది. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో పళనిస్వామి వర్గీయులు చెన్నైలో వీథుల్లోకి వచ్చి సంబరాలు చేసుకున్నారు.హైకోర్టు 2022 సెప్టెంబరు 2న ఇచ్చిన తీర్పును తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, ఏఐఏడీఎంకే నేత పన్నీర్‌సెల్వం సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఈ పిటిషన్లను సుప్రీంకోర్టు గురువారం తోసిపుచ్చింది. అయితే పళనిస్వామి, పన్నీర్‌సెల్వం మధ్య వివాదాన్ని పరిశీలించలేదని తెలిపింది. గతేడాది జూలై 11న జరిగిన ఏఐఏడీఎంకే కార్యనిర్వాహక మండలి సమావేశంలో పార్టీ తాత్కాలిక ప్రధాన కార్యదర్శిగా పళనిస్వామిని నియమించారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారంటూ పన్నీర్‌సెల్వంను పార్టీ నుంచి బహిష్కరించారు. వీటి గురించి వాదనలను పరిశీలించలేదని సుప్రీంకోర్టు గురువారం తెలిపింది. ఐఏడీఎంకే అధినేత్రి, తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జే జయలలిత 2016 డిసెంబరులో దివంగతులయ్యారు. అప్పటి నుంచి ఆ పార్టీలో నేతల మధ్య వివాదాలు తీవ్రమయ్యాయి. ఆమె మొదట తన వారసునిగా ఓ పన్నీర్‌సెల్వంను ఎంపిక చేశారు. ఆమె ఆశీస్సులతోనే పన్నీర్‌సెల్వం ముఖ్యమంత్రి పదవిని చేపట్టారు. ఆ తర్వాత పళనిస్వామి ముఖ్యమంత్రి పదవిని చేపట్టారు. ఏఐఏడీఎంకే సీనియర్ నేత, మాజీ మంత్రి డీ జయకుమార్ మాట్లాడుతూ, సుప్రీంకోర్టు తీర్పు చారిత్రకమైనదని పేర్కొన్నారు.

పొండవులు, కౌరవుల మధ్య యుద్ధంలో పొండవులే గెలిచారన్నారు. పన్నీర్‌సెల్వం రాజకీయ భవిష్యత్తు శూన్యమని అర్థం వచ్చే విధంగా చేతులతో సైగలు చేశారు.

ఏప్రిల్ నాటికి బేగంపేట నాలాపనులు

అధికారులకు మంత్రి తలసాని ఆదేశం

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (సమ సమాజం): ఏప్రిల్ చివరినాటికి బేగంపేట నాలా సమగ్ర అభివృద్ధి పనులను పూర్తి చేయాలని రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆదేశించారు. ఎస్ఎన్‌డీపీ కార్యక్రమం కింద రూ.45 కోట్ల వ్యయంతో చేపట్టిన బేగంపేట నాలా అభివృద్ధి, నిర్మాణ పనులను గురువారం బేగంపేటలోని బ్రాహ్మణవాడిలో మంత్రి పరిశీలించారు. పనులు సాగుతున్న తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. పూడిక తొలగింపు, తాత్కాలిక రోడ్డు నిర్మాణం తదితర పనుల్లో జాప్యం జరుగుతుండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి సంవత్సరం వర్షాకాలంలో నాలాకు ఎగువ నుంచి వచ్చే వరదనీరు సమీపంలోని వ్డదేర బస్తీ, ప్రకాశ్‌నగర్, బ్రాహ్మణ వాడి, అల్లంతోట బావి తదితర కాలనీలు, ఇండ్లలోకి చేరి ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారని, ఆ సమస్యను దూరం చేసే లక్ష్యంతో నాలా అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని పేర్కొన్నారు. అందులో భాగంగానే వరదనీరు రాకుండా నివారించేందుకు నాలాకు కుడి వైపున 634 మీటర్ల పొడవున రిటైనింగ్ వాల్‌ను నిర్మించడం జరిగిందని, 660 మీటర్ల మేర ఉన్న రిటైనింగ్ వాల్ ఎత్తు పెంచడం జరిగిందని చెప్పారు. అదేవిధంగా ఎడమ వైపున 854 మీటర్ల మేర నూతన రిటైనింగ్ నిర్మాణం, 386 మీటర్ల మేర ప్రస్తుతం ఉన్న రిటైనింగ్ వాల్ ఎత్తు పెంచి నిర్మించడం జరిగిందని వివరించారు. ప్రతిపాదించిన చేపట్టిన పనులను అన్ని అనుకున్న సమయంలో పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్, ఎస్ఎన్‌డీపీ, విద్యుత్ తదితర శాఖల అధికారులు పరస్పర సహకారంతో పనులను వేగవంతం చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. నాలా వెంట ఉన్న కాలనీలలో సీవరేజ్, వాటర్ లైన్ పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. పనులన్నీ పూర్తయితే ఎన్నో సంవత్సరాల నుంచి ఆయా ప్రాంతాల ప్రజలు పడుతున్న వరదముంపు సమస్య శాశ్వతంగా పరిష్కారం అవుతుందని చెప్పారు. మంత్రి వెంట కార్పొరేటర్ మహేశ్వరి, ఎస్ఎన్‌డీపీ ఈఎన్‌సీ జియాఉద్దీన్, సీఈ కిషన్, వాటర్ వర్క్స్ డైరెక్టర్ ఆపరేషన్స్ కృష్ణ, ఎస్‌సీ భాస్కర్ రెడ్డి, ఈఈ సుదర్శన్, వాటర్ వర్క్స్ జీఎం రమణారెడ్డి, ఎలక్ట్రికల్ ఈడీ సుధీర్, టౌన్ ఎలానింగ్ ఏసీపీ క్రిస్టోఫర్ తదితరులు ఉన్నారు.

కుక్కలదాడిలో బాలుడు మృతి ఘటన

కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలి: హైకోర్టు

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (సమ సమాజం): అంబర్‌పేట కుక్కల దాడిలో బాలుడి మృతిపై హైకోర్టు సీరియస్ అయింది. బాలుడి కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని కోర్టు ఆదేశించింది. అంబర్‌పేట లో కుక్కల దాడిలో బాలుడి మృతి ఘటనపై హైకోర్టు స్పందించిన విషయం తెలిసిందే. దీనిపై పత్రికల్లో వచ్చిన కథనాలను సుమోటోగా హైకోర్టు విచారణకు స్వీకరించింది. దీనిపై గురువారం చీఫ్ జస్టిస్ ఉజ్జల్ భుయాన్, జస్టిస్ ఎన్.తుకారాంజీ ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ పిటిషన్‌లో మున్సిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి, హైదరాబాద్ కలెక్టర్, జీహెచ్ఎంసీ, తదితరులను ప్రతివాదులుగా చేర్చింది. విచారణ సందర్భంగా హైకోర్టు పలు కీలక వ్యాఖ్యలు చేసింది. జీహెచ్ఎంసీ నిర్లక్ష్యం వల్లే బాలుడు మృతి చెందాడని న్యాయస్థానం వ్యాఖ్యానించింది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఏం చర్యలు తీసుకున్నారని జీహెచ్ఎంసీని ప్రశ్నించింది. రాష్ట్రంలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. ముఖ్యంగా చిన్నారులపై దాడి చేస్తున్నాయి. హైదరాబాద్ లో నాలుగేళ్ల పసివాడు ప్రదీప్‌ను వీధి కుక్కలు పొట్టనపెట్టుకున్నాయి. బాలుడు ప్రదీప్ మృతి ఘటనలో అంబర్‌పేట పోలీసుల తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పసివాడు మరణించి నాలుగు రోజులు గడిచినా కేసు నమోదు చేయకపోవడం పోలీసుల నిర్లక్ష్యానికి నిదర్శనమని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ నెల 19న ఘటన జరిగిన విషయం తెలిసిందే. ప్రదీప్ తండ్రి గంగాధర్ 100కు ఫోన్ చేయగా.. ఘటనాస్థలానికి వచ్చిన పోలీసులు, ఎలాంటి కేసు నమోదు చేయకపోవడం బాధ్యతారాహిత్యమేనని స్థానికులు ఆరోపిస్తున్నారు. తమకు ఎవరు ఫిర్యాదు చేయలేదని, తాము ఎవరిపై కేసు నమోదు చేయలేదని పోలీసులు చెప్పడం.. సమస్యను దాటవేయడమేనన్న విమర్శలు వినిపిస్తు న్నాయి. కాగా, ఈ ఘటనకు సంబంధించి నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ గోల్నాక సెక్టార్ ఎస్సై విజయ్‌కు ఇన్‌చార్జి సీఐ ప్రభాకర్ షోకాజ్ నోటీసు జారీ చేశారు.

వీధికుక్క స్వైర విహారం

పదిమందిని కరచి పరార్

రంగారెడ్డి,ఫిబ్రవరి23(ఆర్ఎన్ఎ): రంగారెడ్డి జిల్లా యాచారం మండల కేంద్రంలో గురువారం ఉదయం ఓ వీధి కుక్క స్వైర విహారం చేసింది. ఏకంగా పది మందిని తీవ్రంగా గాయపరిచింది. మండల కేంద్రంలో సాగర్ రహదారిపై వివిధ పనుల నిమిత్తం మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన ప్రజలు ఎల్లమ్మగుడి సమీపంలో రోడ్డుపై ఉన్నారు. అకస్మాత్తుగా అనుకోకుండా ఓ పిచ్చి కుక్క దొరికిన వారిని దొరికినట్టు కరుస్తూ పోయింది. పిచ్చికుక్క కాటుకు పదిమంది తీవ్ర గాయాల పాలయ్యారు. వీరందరినీ స్థానికుల సహాయంతో యాచారం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు వారికి ప్రథమ చికిత్సను అందించారు. అనంతరం పిచ్చికుక్క దాడిలో తీవ్రంగా గాయపడిన పలువురిని రెండు 108 అంబులెన్స్ వాహనాలలో నారాయణగూడ దవాఖానాకు తరలించారు. ఎంపీపీ సుకన్య, ఎంపీడీవో విజయలక్ష్మి, ఎంపీఓ ఉమారాణి బాధితులను పరామర్శించి వారిని దవాఖానకు తరలించడంలో సహాయపడ్డారు. గ్రామాలలో వీధి కుక్కలను అరికట్టేందుకు చర్యలు చేపడతామని ఎంపీపీ సుకన్య తెలిపారు.

నేడు ఎపి గవర్నర్‌గా అబ్దుల్ నజీర్ ప్రమాణం

ప్రమాణస్వీకారోత్సవానికి ముస్తాబైన రాజ్‌భవన్

విజయవాడ చేరుకున్న నజీర్‌కు సిఎం జగన్ ఘనస్వాగతం



అమరావతి, ఫిబ్రవరి 23 (సమ సమాజం): ఏపీ కొత్త గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ఈ నెల 24న శుక్రవారం ప్రమాణ స్వీకారం చేయబోతున్నారు. కొత్త గవర్నర్ ప్రమాణ స్వీకార ఘట్టానికి రాజ్ భవం ముస్తాబు అయింది. హైకోర్టు చీఫ్ జస్టిస్ ఆయన చేత ప్రమాణం చేయిస్తారు. ఈ కార్యక్రమానికి సిఎం జగన్ సహా మంత్రులు, పలుఉవరు విఐపిలు హాజరు కానున్నారు. దీంతో భారీగా ఏర్పాట్లు చేశారు. ఇదిలా ఉంటే గత రాత్రి గన్నవరం ఎయిర్ పోర్టుకు ప్రత్యేక విమానం ద్వారా వచ్చిన గవర్నర్ నజీర్‌కి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఘన స్వాగతం పలికారు. విజయవాడలో గవర్నర్ బస చేసిన రాజ్ భవన్‌కి వెళ్లి ఆయనతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. దాదాపుగా గంట పాటు ఈ ఏకాంత భేటీ సాగిందని తెలుస్తోంది. ఏపీకి కొత్త గవర్నర్‌గా వచ్చిన నజీర్‌తో సిఎం జగన్ మర్యాదపూర్వకంగా కలిసినట్లు చర్చ సాగుతోంది. గవర్నర్ ప్రమాణస్వీకారం తరవాత త్వరలో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలపై సిఎం జగన్ దృష్టి సారించనున్నారు. ఏపీలో ప్రభుత్వం నాలుగేళ్ళుగా అమలు చేస్తున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలు ప్రభుత్వం పెట్టుకున్న ప్రాధాన్యతలు వంటి వాటి మీద జగన్ గవర్నర్ కి వివరించి ఉంటారని అంటున్నారు. ఏపీకి కొత్త గవర్నర్ గా నియమితులైన అబ్దుల్ నజీర్ న్యాయమూర్తిగా అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో సుదీర్ఘ కాలం పనిచేసి ఉన్నారు. ఆయనకు రాజ్యాంగ పరమైన అంశాలలో ఎంతో నిపుణత ఉంది. ఒక విధంగా అచ్చమైన రాజ్యాంగ నిపుణుడిగా పేర్కొనాలి. అదే సమయంలో ఆయన గవర్నర్ గా రాజ్యాంగబద్ధమైన విధులను నిర్వహించ బోతున్నారు. రాజ్యాంగపరంగా ఏది సహేతుకమో ఏది అవసరమో గవర్నర్‌గా ఆయనకు క్షుణ్ణంగా అవగాహన ఉంటుంది. ఇక రాజకీయపరంగా చూస్తే ఆయన పొరుగునే ఉన్న కర్నాటకకు చెందిన వారు. ఏపీ రాజకీయాల మీద కచ్చితంగా చాలా వరకూ అవగాహన ఉంటుందని అంటున్నారు.ఆయన క్రియాశీలంగా ఉండే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయని అంటున్నారు. ఎన్నికలు ఏడాదిలో ఉన్న ఏపీలో ఏరికోరి కేంద్రం ఆయనను ఏపీకి గవర్నర్ గా పంపడం వెనక చాలా వ్యూహం ఉండివుంటుందని అంటున్నారు. ఇకపోతే మూడున్నరేళ్ళుగా పాత గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ తో వైసీపీ ప్రభుత్వానికి అంతా సాఫీగా సాగిపోయింది. కొత్త గవర్నర్ నజీర్ తో కూడా అదే సయోధ్యను వైసీపీ ప్రభుత్వం కోరుకుంటోంది. అయితే ఇక్కడ అబ్దుల్ నజీర్ కి కూడా గవర్నర్ పదవి కొత్త అనుభవమే. అయినా కానీ ఆయన రాజ్యాంగ పరిరక్షకుడిగా మాత్రం సీనియర్ కాబట్టి గవర్నర్‌గా తన పదవీ నిర్వహణ ఉంటుందని అంటున్నారు.

భూ ఆక్రమణ రుజువు చేయకుంటే చర్యలు

రేవంత్‌కు సవాల్ విసిరిన ఎమ్మెల్యే రేగా

భద్రాద్రికొత్తగూడెం, ఫిబ్రవరి 23 (సమ సమాజం): గిరిజనుడిని అనే అక్కసుతో నన్ను తొలగించిన వీళ్లా... నా గురించి మాట్లాడేది అంటూ.. టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి పై ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే రేగా కాంతారావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. 'హాత్ సే హాత్ జోడో' పాదయాత్ర లో రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై రేగా కౌంటర్ అటాక్‌కు దిగారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ... 'రేవంత్ రెడ్డి ఖబడ్దార్.. రేగా కాంతారావుతో పెట్టుకోకు' అంటూ హెచ్చరించారు. పినపాకలో కాంగ్రెస్ పార్టీని బతికించినట్లు తెలిపారు. ఇక్కడ బలంగా ఉందంటే తానే కారణమని చెప్పుకొచ్చారు. డీసీసీ అధ్యక్షునిగా ఎక్కువ కాలం ఉన్నది తానొక్కడినే అని ఆయన తెలిపారు. తెలంగాణా అభివృద్ధి ఫలాలను ప్రజలకు అందించేందుకు... నేను రాజ్యాంగ బద్ధంగా బిఆర్ఎస్‌లో విలీనమయ్యాను. ఓటుకు నోటు కేసులో ఉన్న వీళ్లా నాగురించి మాట్లాడేది. నామీద చార్జ్‌షీట్.. నీకు దమ్ముంటే ఎవరైనా రండి.. 300 ఎకరాలు నేను ఆక్రమించినట్టు రుజువు చేయండి.. ముక్కు నేలకు రాస్తా' అంటూ సవాల్ విసిరారు. రేవంత్ వ్యాఖ్యలపై పరువు నష్టం దావా వేస్తానని... అన్ని స్టేషన్లలో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. తనపై చేసిన ఆరోపణలు నిజమని నిరూపిస్తే అసలు పోటీ నుంచే తప్పుకుంటానని రేగా కాంతారావు స్పష్టం చేశారు.

ఎంఐఎం అభ్యర్థి మీర్జా రెహమత్ బేగ్ నామినేషన్ దాఖలు

(మొదటి పేజీ తరువాయి) ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ తదితరులు పాల్గొన్నారు. తనకు ఈ అవకాశం కల్పించిన అసదుద్దీన్ ఓవైసీకి మీర్జా రెహమత్ బేగ్ ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలియజేశారు. తాను చిన్న కార్యకర్త నుండి ఎంఐఎంలో పనిచేస్తున్నానన్నారు. తన కృషిని గుర్తించి ఇంత పెద్ద పదవి ఇవ్వడం బాధ్యతగా ఫీల్ అవుతున్నానని రహమత్ బేగ్ హర్షం వ్యక్తం చేశారు.

శ్రీరామరక్ష కెసిఆర్

(మొదటి పేజీ తరువాయి) లేదు, కరెంటు లేదు, నీళ్లు వస్తలేవు, రైతుబీమా లేదు, ఆడపిల్లల పెళ్లి చేసుకుంటు కల్యాణలక్ష్మి రాదు, ముసలివారికి ఆసరా పింఛన్లు రావడం లేదని చెప్పి తెలంగాణలో కలుపుకోవాలని మంత్రులను కోరుతున్నారు. పక్కనే ఉన్న కర్ణాకటలో రాయ్‌చూర్ జిల్లాలో శివరాజ్‌పాటిల్ అనే బీజేపీ ఎమ్మెల్యే తెలంగాణలో అమలపుతున్న పథకాలు చేయాలని, లేకుంటే రాయ్‌చూర్‌ను తెలంగాణలో కలపాలని మీటింగ్‌లలో కోరుతున్నరు' అని కేటీఆర్ అన్నారు. ఎమ్మెల్యే రమణారెడ్డి ప్రత్యేకమైన గౌరవం ఉందన్నారు. ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు తిరుగుతూ మాట్లాడు తున్నడు. ఒక్క చాన్స్ ఇవ్వండి అని అడుక్కుంటున్నడు. ఆయనకు, మీ అందరికీ గుర్తు చేస్తున్నా. 75 స్వాతంత్యం÷-ర అనంతరం ఒక్కఛాన్స్ కాదు.. మన రాష్ట్రంలో పది చాన్స్‌లు ఇచ్చాం. 50 సంవత్సరాల పాటు ఈ రాష్ట్రాన్ని, దేశాన్ని పరిపాలించింది కాంగ్రెస్ పార్టీ. ఇదే భూపాలపల్లిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్న సమయంలో పేలిపోయే ట్రాన్స్‌ఫార్మర్‌లు, కాలిపోయే మోటర్లు, అర్ధరాత్రి దొంగోలే వచ్చే కరెంటు.. దానికి కాపాలా కాసేందుకు వెళ్లి ఎవరు పాముకుట్టి చనిపోతారో తెలియదు. తేలుకట్టి, కరెంటు షాక్ తగిలి చనిపోతారో తెలియని పరిస్థితులుండేవని గుర్తు చేశారు. ప్రపంచంలో అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ఎక్కడ ఉందని గూగుల్‌లో కొడితే భూపాలపల్లి జిల్లాలో ఉందని అని గల్లా ఎగరేసి ఈ ప్రాంత బిడ్డలు ఎంత గర్వంగా చెప్పుకోవచ్చు. మా తెలంగాణ గడ్డపై, మా భూపాలపల్లి జిల్లాలో మా ముఖ్యమంత్రి కేసీఆర్ కట్టిండు.. 75 సంవత్సరాల్లో ఏ ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి చేయని పని చేసిండని భూపాలపల్లి బిడ్డలు గర్వంగా చెప్పుకునే పరిస్థితి కేసీఆర్ తీసుకువచ్చారని కెటిఆర్ అన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కాళేశ్వరాన్ని భూపాలపల్లి జిల్లాలోనే నిర్మించామని, ఇక్కడి ప్రజలు గొప్పగా చెప్పుకునే పరిస్థితి సీఎం కేసీఆర్ కల్పించారని మంత్రి కేటీఆర్ అన్నారు. 'మాది మూమ్మాటికి కుటుంబ పాలనే. అవును. తెలంగాణలోని 4 కోట్ల మంది ప్రజలు కేసీఆర్ కుటుంబ సభ్యులేనని అన్నారు. మాకు కులం పిచ్చి లేదు. మతం పిచ్చి లేదు. ఒక పిచ్చోడు ప్రగతిభవన్ పేల్చేస్తాం అంటాడు. మరోకడు సచివాలయం పేల్చేస్తాం అంటున్నాడు. ఒకడితో మరోకడు పోటీ పడుతున్నారు. పిచ్చోడి చేతిలో రాయి ఉంటే ప్రజలు ఇబ్బంది పడాల్సి వస్తుంది. ఇలాంటి మనుషుల చేతుల్లో రాష్ట్రం పెడితే ఆగమైతది. వాళ్లు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని కెటిఆర్ మండిపడ్డారు. కాంగ్రెస్ కు 10 సార్లు అవకాశం ఇస్తే ఏం చేశారో ప్రజలకు చెప్పండని అన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన హక్కుతోనే ఎమ్మెల్యే గండ్ర బాజాప్తుగా కాంగ్రెస్ నుండి గులాబీ పార్టీలో లో చేరారని చెప్పారు. మధుసూదనాచారిని ఎమ్మెల్సీ గా చేసి సీఎం కేసీఆర్ గౌరవించారని అన్నారు. ఎవరి సమర్థతా ఏంటో సీఎం కేసీఆర్ కు తెలుసన్నారు. ప్రజల మనసులు గెలవాలంటే ఏం చేయాలో చెప్పాలి.. ఏం చేశామో కూడా చెప్పాలి అని మంత్రి కేటీఆర్ వ్యాఖ్యానించారు.

కరీంనగర్ కలెక్టరేట్ నిర్మాణ పనులు

కార్పోరేట్ కార్యాలయం నిర్మించాలన్న స్మితా సబర్వాల్

(మొదటి పేజీ తరువాయి) సందర్భంగా స్మిత మాట్లాడుతూ కార్యాలయ భవనాన్ని ఓ ప్రభుత్వ కార్యాలయంగా కాకుండా కార్పోరేట్ ఆఫీస్ గా తీర్చిదిద్దాలని సూచించారు. 100 ఫీట్ల రోడ్డు నిర్మాణం చేపట్టాలని, దానితో పాటు జిల్లా కలెక్టర్ల క్యాంపు కార్యాలయ నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని తెలిపారు. నిర్మాణా పనులన్ని వేగవంతంగా పూర్తిచేసుకొని రానున్న ఆగస్టు నెలలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించడానికి సిద్ధం చేయాలన్నారు. ఐడీఓసీ, క్యాంపు కార్యాలయాల నిర్మాణాలలో అదనపు నిధుల అవసరం ఉంటే ప్రతిపాదనలను తనకు పంపించాలన్నారు. కలక్టరేట్ వద్ద మురుగు కాలువ వలన ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని వివరించారు. స్మార్ట్ సిటీ పనులతో మరింత అందంగా తీర్చిదిద్దాలని తెలిపారు. అంతకు ముందు కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన ఫొటో ప్రజంటేషన్ ను తిలకించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆర్. వి. కర్ణన్, సీపీ సుబ్బారాయుడు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, జడ్పీ సీఈవో ప్రియాంక, ట్రైని కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో, ఇంటిగేషన్ అధికారులు, గుత్తేదారు పాల్గొన్నారు.

అంధత్వ రహిత తెలంగాణ ప్రభుత్వ లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి) **సిద్దిపేట, ఫిబ్రవరి 23 (సమ సమాజం):** అంధత్వ రహిత తెలంగాణ లక్ష్యంగా నినాదంతో ప్రభుత్వం ముందుకు వెళ్తుందని రాష్ట్ర వైద్య శాఖ మంత్రి హరీశ్‌రావుతెలిపారు. ముఖ్యమంత్రి కెసిఆర్ ఆలోచనతో ప్రారంభించిన కంటి వెలుగు అద్భుతంగా కొనసాగుతున్నదని ప్రశంసించారు. కంటి వెలుగు కార్యక్రమంతో ప్రజలకు ఆనంద భాష్పాలు వస్తుంటే ప్రతిపక్షాలకు కన్నీళ్లు వస్తున్నాయని మంత్రి హరీష్ రావు అన్నారు. సిద్దిపేట జిల్లాలోని 26వ వార్డు ఏకలవ్య సంఘం భవనంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని మంత్రి హరీష్ రావు పరిశీలించారు. ప్రతీ గ్రామంలో కంటి వెలుగు శిబిరాలు విజయవంతంగా కొనసాగుతున్నాయన్నారు. ఇప్పటి వరకు1,68,062 మందికి కంటి పరీక్షలు నిర్వహించి సిద్దిపేట జిల్లా మొదటి స్థానంలో ఉందని మంత్రి కొనియాడారు. సర్వేంద్రియాం.. నయనం ప్రధానం అన్న వ్యాఖ్యను గుర్తుచేస్తూ.. దృష్టి లోపాన్ని నివారించేందుకు సీఎం కేసీఆర్ కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారని చెప్పారు. ప్రజలందరూ సీఎం కేసీఆర్‌ను తమ పెద్ద కొడుకులా భావిస్తున్నారని, ఈరోజుకు కంటి పరీక్షలు 50 లక్షల మార్కును చేరుకున్నామని తెలిపారు. కేవలం 25 రోజుల సమయంలోనే ఈ రికార్డు సాధించామన్న మంత్రి హరీష్ రావు... ఇందుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. ఇదే స్ఫూర్తిని చివరి వరకు కొనసాగించాలని సూచించారు. కుల,మత ప్రాంతాలకు అతీతంగా పక్క రాష్ట్రాల వారికి కూడా కంటి పరీక్షలు నిర్వహించి అద్దాలు అందజేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో 16 లక్షల మంది ప్రజలు కంటి చూపుతో భాధపడుతున్నట్లు గుర్తించామని చెప్పారు. వారికి కంటి వెలుగులు ప్రసాదించిన నాయకుడు సీఎం కేసీఆర్ అని పొగడ్తలతో ముంచెత్తారు. ఇందులో అధికంగా మహిళలే ఉన్నారన్న మంత్రి ... గతంలో చైనా నుంచి అద్దాలను దిగుమతి చేసుకుంటే.. ఈసారి మేడిన్ తెలంగాణ కంటి అద్దాలు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. పంజాబ్, ఢిల్లీ సీఎంలు సైతం ఈ కార్యక్రమం బాగుందని కితాబిచ్చినట్టు గుర్తు చేశారు. రెండో విడత కంటి వెలుగు కోసం రూ.250 కోట్లు ఖర్చు చేస్తున్నామని స్పష్టం చేశారు. ఇప్పటివరకూ సహకరిస్తున్న ప్రతి శాఖకు చెందిన అధికారులు, సిబ్బందికి ధన్యవాదాల అని, రాష్ట్రంలో చివరి వ్యక్తికి పరీక్ష చేసే వరకు కంటి పరీక్షలు కొనసాగుతాయని హరీష్ రావు హామీ ఇచ్చారు. తెలంగాణ ప్రజలు ఎవరూ కూడా కంటి సమస్యతో బాధ పడకుండా ముఖ్యమంత్రి కేసీఆర్ కంటి వెలుగు అనే మహోన్నత కార్యక్రమానికి శ్రీకారం చుట్టిండ న్నారు. పండుగ వాతావరణంలో జరుగుతున్న కంటి వెలుగులో నేటికి 50 లక్షల మందికి పరీక్షలు నిర్వహిం చామని వెల్లడించారు. 25 పని దినాల్లో ఇంత పెద్ద సంఖ్యలో పరీక్షలు చేయడం, అవసరం ఉన్నవారికి అద్దాలు పంపిణీ చేయడం గొప్ప విషయమని పేర్కొన్నారు. ఆసుపత్రుల వద్దకు ప్రజలు రావడం కాదు, ఊరుకు, వాడకు ప్రభుత్వమే కదిలి వస్తున్నదని చెప్పారు. ఉచితంగా కంప్యూటరైజ్డ్ కంటి పరీక్షలు నిర్వహించి, మందులు, అవసరం అయిన వారికి కళ్లద్దాలు పంపిణీ చేస్తున్నదని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కంటి వెలుగు లో భాగస్వామ్యం అయిన సహచర మంత్రులకు, శాసనసభ్యులకు, శాసన మండలి సభ్యులకు , జిల్లా పరిషత్ చైర్మన్లకు , కార్పొరేషన్ చైర్మన్లకు, మున్సిపల్ చైర్మన్లకు, జడ్పీటీసీ, ఎంపీపీ, సర్పంచులు, ఎంపీటీసీ లకు ప్రజాప్రతినిధులు, అధికారులకు మంత్రి హరీశ్‌రావు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రో.జాశర్మ తదితరులు పాల్గొన్నారు.

అమెరికాలో మరోమారు మంచు తుఫాన్

1500 విమానాల రద్దు



(మొదటి పేజీ తరువాయి) నివాసాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గంటకు 55 నుంచి 70 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని, భారీ మంచు కూడా కురిసే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు హెచ్చరించారు. రహదారులపై ప్రయాణించే వారు తప్పనిసరిగా తమ వెంట సేఫ్టీ కిట్‌ను ఉంచుకోవాలని నిపుణులు సూచించారు. విన్నేసోటా, డెన్వర్, సాల్ట్ లేక్ సిటీ, మినియాపోలిస్, సెయింట్‌పాల్‌లో పరిస్థితులు దారుణంగా మారాయి. ఈ పరిస్థితుల మధ్య 1500 విమానాలను రద్దు చేశారు. లక్షలాది నివాసాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ ప్రమాదకరపు శీతాకాలపు తుపాన్‌ను ఎదుర్కొనేందుకు సిద్ధం కావాలని లాస్ ఏంజిల్స్‌లోని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఒక వైపు అమెరికా పశ్చిమ, ఉత్తర ప్రాంతాలు చలికి వణికిపోతుంటే.. తూర్పు ప్రాంతాల్లో అసాధారణ ఉష్ణోగ్రతలు నమోదు అవుతుండటం గమన్నరం.

వీధికుక్కల తరలింపునకు ప్రత్యేక చర్యలు

(మొదటి పేజీ తరువాయి) సమావేశం నిర్వహించారు. జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్న హోటల్స్, రెస్టారెంట్స్, ఫంక్షన్ హాల్స్, చికెన్ , మటన్ సెంటర్లు వ్యర్థాలను వీధుల్లో వేయకుండా కట్టడి చేయాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. నగరంలో కుక్కల సంఖ్యను నిరోధించడానికి తగిన చర్యలు చేపట్టాలని తెలిపారు. నగరంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో పెంపుడు కుక్కలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అర్వింద్‌కుమార్ పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలు, హోర్డింగ్స్ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. నగర, మున్సిపాలిటీల పరిధిలో ఉన్న స్లమ్ డెవలప్‌మెంట్ ఫెడరేషన్స్, టౌన్ డెవలప్‌మెంట్ ఫెడరేషన్స్, రెసిడెంట్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్స్ సహకారంతో నియంత్రణ చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలోని ఇతర మున్సిపాలిటీల్లో మెప్మా స్వయం సహాయక బృందాలతో నియంత్రణ చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. పెంపుడు జంతువుల నమోదుకు ప్రత్యేక మొబైల్ యాప్‌ను సిద్ధం చేయాలని అధికారులకు అర్వింద్‌కుమార్ సూచించారు. ఇది మంచి నిర్ణయమని కాశీనాథ్ అన్నారు. ఈ పని తక్షణమే అమలయ్యేలా చూడాలన్నారు.

బండి నేతృత్వంలోనే అసెంబ్లీ ఎన్నికల పోరు

(మొదటి పేజీ తరువాయి) ఎన్నికలకు బండి ఆధ్వర్యంలోనే పార్టీ పోరాదనుంది. బండి సంజయ్ నేతృత్వంలోనే బీజేపీ రాష్ట్ర ఎన్నికలను ఎదుర్కొనుంది. రాష్ట్రంలో బీజేపీని బాలోపేతం చేయడానికి జాతీయ నేతలు కూడా సన్నద్ధమౌతున్నారు. ఇప్పటికే బీజేపీ రాష్ట్ర ఇన్చార్లుగా ముగ్గురు జాతీయ నేతలు ఉన్నారు. కాగా, బండి సంజయ్ నేతృత్వంలో ఇప్పటికే ప్రజాగోస బీజేపీ భరోసా నినాదంతో రాష్ట్రవ్యాప్తంగా సభలు నిర్వహిస్తున్నారు. ప్రతీ పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాల్లో 100కు తగ్గకుండా సభలు జరుపనున్నారు. ఈ సమావేశాలకు కేంద్ర మంత్రులు, పార్టీ సీనియర్ నాయకులు హాజరవుతున్నారు. వచ్చే ఎన్నికల కోసం రాష్ట్రంలో బీజేపీని బలోపేతం చేసేందుకు నేతలు రంగంలోకి దిగుతున్నారు.

అత్యంత విషమంగా ప్రీతి పరిస్థితి

(మొదటి పేజీ తరువాయి) కాకతీయ మెడికల్ కాలేజ్‌లో వేధింపులు తాళలేక వైద్య విద్యార్థిని ప్రీతి బుధవారం నాడు మత్తు ఇంజక్షన్ వేసుకుని ఆత్మహత్యాయత్నం చేసిన విషయం తెలిసిందే. వెంటనే అలర్ట్ అయిన సహ విద్యార్థులు, వైద్య సిబ్బంది ఆమెకు చికిత్స అందించారు. అధిక మోతాదులో మత్తుమందు తీసుకోవడంతో పరిస్థితి విషమించింది. దాంతో ఆమెను హైదరాబాద్ నిమ్స్‌కి తరలించారు. ప్రస్తుతం నిమ్స్‌లో ప్రీతికి చికిత్స అందిస్తున్నారు వైద్యులు. ఆమె పరిస్థితి విషమంగా ఉందని చెబుతున్నారు. వైద్య విద్యార్థిని ప్రీతి ఘటనపై విద్యార్థి సంఘాలు ఆందోళనబాట పట్టాయి. వరంగల్ కేఎంసీలో రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు ఎస్ఎఫ్ఐ నాయకులు ఆందోళన చేపట్టారు. ప్రీతిపై వేధింపులకు పాల్పడిన సీనియర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశఆరు. ప్రిన్సిపల్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై హైలెవల్ కమిటీతో విచారణ చేపట్టాలని, బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు.మరోవైపు ప్రతి ఆరోగ్య పరిస్థితిని డీఎంఈ రమేష్ రెడ్డి ఆరా తీసారు. మెడికల్ స్టూడెంట్స్ మధ్య ర్యాగింగ్ ఉంటుందని, అయితే పిజి మెడికల్ స్టూడెంట్స్ మధ్యన మాత్రం అలాంటిది ఉండదని డీఎంఈ రమేష్ రెడ్డి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. నిమ్స్‌లో చికిత్స పొందుతున్న ప్రీతి ఆరోగ్యపరిస్థితిపై ఆరా తీసేందుకు ఆయన నిమ్స్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఫస్ట్, సెకండియర్‌లో ర్యాగింగ్ సాధారణమేనని.. పీజీలో ఉండదని అన్నారు. కేఎంసీ కాలేజీలో ఎలాంటి ర్యాగింగ్ జరగలేదన్న డీఎంఈ.. ఘటనపై కమిటీ నివేదిక వచ్చిన తర్వాతే చర్యలు ఉంటాయని చెప్పారు. రెండు రోజుల క్రితం ఈ ఘటనపై కాలేజీ ప్రిన్సిపల్ ఇద్దరినీ పిలిచి కౌన్సిలింగ్ చేయడం జరిగిందని డీఎంఈ రమేష్ రెడ్డి అన్నారు. అయితే ప్రీతి ఆరోగ్య పరిస్థితి ఇంకా విషమంగానే ఉందని, చికిత్స జరుగుతుందని అన్నారు. ఇంకా మెరుగైన చికిత్స అందించేందుకు కూడా డాక్టర్లకు సూచన చేశామని చెప్పారు. చికిత్సకు సంబంధించి అన్నిరకాలుగా చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. ఈ కేసుకు సంబంధించి పోలీసులు కూడా విచారణ జరుపుతున్నారని, నివేదిక వచ్చిన తర్వాత బాధ్యులపై చర్యలు తీసుకుంటామని రమేష్ రెడ్డి స్పష్టం చేశారు. కాగా పీజీ వైద్య విద్యార్థిని ప్రీతి ప్రాణాల కోసం పోరాడుతోంది. ప్రీతిని కాపాడేందుకు నిమ్స్ వైద్యులు శతవిధాలుగా ప్రయత్నిస్తున్నారు. ఆమె పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు నిమ్స్ వైద్యులు తెలిపారు. అనస్తీషియా ఎక్స్‌పర్ట్ డాక్టర్ పద్మజ పర్యవేక్షణలో అయిదుగురు డాక్టర్ల ప్రత్యేక బృందం పర్యవేక్షణలో ప్రీతికి చికిత్స అందుతోంది. ఎంత ఖర్చయినా ప్రీతి వైద్యంలో వెనుకాడమని నిమ్స్ అధికారులు తెలిపారు. వరంగల్ నుంచి హైదరాబాద్ నిమ్స్‌కు తరలించేలోగా ప్రీతి గుండె చప్పుడు రెండు సార్లు ఆగిపోయింది. వెంటనే సీపీఆర్ చేయడంతో తిరిగి గుండె కొట్టుకోవడం మొదలుపెట్టింది. ప్రస్తుతానికి వెంటిలేటర్ పైనే ప్రీతికి చికిత్స కొనసాగుతోంది. ప్రీతికి ఇప్పటికే వైద్యులు మూడు సార్లు సీపీఆర్ చేశారు.

ప్రభుత్వంపై బురదజల్లే యత్నాలు: అంబటి

అమరావతి, ఫిబ్రవరి 23 (సమ సమాజం): టిడిపి నేత పట్టాభి విషయంలో వైసిపి అధికార దుర్వినియోగం చేయలేదని మంత్రి అంబటి రాంబాబు పేర్కొన్నారు. తాడేపల్లిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వంపై బురద చల్లేందుకు టిడిపి ప్రయత్నిస్తోందని ఆయన అన్నారు. చంద్రబాబును అధికారంలోకి తీసుకురావాలని పత్రికల్లో గత ఫోటోలతో దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. దీనిపై పత్రిక యాజమాన్యం క్షమాపణ చెప్పకపోతే రాష్ట్ర ప్రభుత్వం తరుపున పరువునష్టం దావా వేస్తామని హెచ్చరించారు.

దేశంకోసం ఆడడానికే ప్రాధాన్యం ఇస్తా

చెన్నై సూపర్ కింగ్స్ ఆటగాడు బెన్ స్టోక్స్

చెన్నై, ఫిబ్రవరి 23 (సమ సమాజం): ఐపీఎల్ మొదలవక ముందే చెన్నై సూపర్ కింగ్స్‌కు ఎదురు దెబ్బలు తగులు తున్నాయి. ఇదివరకే గాయం కారణంగా పేసర్ జేమీసన్ సీజన్ మొత్తానికి దూరంగా కాగా, ఇప్పుడు స్టార్ ఆల్ రౌండర్ బెన్ స్టోక్స్ చివరి దశ మ్యాచులకు దూరం అవుతున్నాట్లు తెలిపాడు. ఐపీఎల్ ఫైనల్ మే28 నుంచి జరగనుంది. ఇంగ్లండ్‌కు జూన్ 1 నుంచి ఐర్లాండ్ తో టెస్టు సిరీస్ ప్రారంభం కానుంది. తర్వాత జూన్ 16 నుంచి యాషెస్ సిరీస్ మొదలవుతుంది. బెన్ స్టోక్స్ వీటిలో ఆడాలంటే ప్రాక్టీస్ కోసం ప్లేఆఫ్స్ కు దూరంకావాల్సి ఉంటుంది. 'సీఎస్ కే ప్లేఆఫ్స్ చేరినా ఐపీఎల్ ను వీడతా. ఇలాంటి సమయంలో ఐపీఎల్ కంటే దేశానికే తొలి ప్రాధాన్యం ఇస్తా. ఈ విషయం గురించి మిగతా టీంమేట్స్ తో చర్చించాలి. టెస్టు సిరీస్ కోసం తగినంత సమయం కేటాయించాలనే ఈ నిర్ణయం తీసుకున్నానని స్టోక్స్ తెలిపాడు. కాగా అతడిని చెన్నై రూ.16.25 కోట్లకు కొనుగోలు చేసింది.

మూడు వన్డేల కోసం ఆస్ట్రేలియా జట్టు ఎంపిక

గాయాల నుంచి కోలుకుని జట్టులో చేరిన సీనియర్లు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23 (సమ సమాజం): టీమిండియాతో జరిగే మూడు వన్డే మ్యాచుల కోసం క్రికెట్ ఆస్ట్రేలియా తమ జట్టును ప్రకటించింది. గాయాలనుంచి కోలుకున్న ముగ్గురు సీనియర్ ఆసీస్ ప్లేయర్లు జట్టులో చేరారు. పాట్ కమిన్స్ నాయకత్వం వహిస్తున్నాడు. టెస్టు సిరీస్ లో చెత్త ప్రదర్శన, వన్డే వరల్డ్ కప్ ను దృష్టిలో ఉంచుకొని జట్టును ఎంపిక చేసినట్లు ఆసీస్ చీఫ్ సెలెక్టర్ జార్జ్ బెయిలీ తెలిపాడు. ఆస్ట్రేలియా-భారత్‌ల మధ్య తొలి వన్డే మార్చి 17న ముంబైలో జరగనుంది. మిగిలిన రెండు మ్యాచ్‌లు వైజాగ్ (మార్చి 19), చెన్నై (మార్చి 22)లో జరగుతాయి. ఆస్ట్రేలియా వన్డే జట్టు: పాట్ కమిన్స్ (సి), సీన్ అబాట్, అష్టన్ అగర్, అలెక్స్ కారీ, కెమెరాన్ గ్రీన్, ట్రావిస్ హెడ్, జోష్ ఇంగ్లిస్, మార్నస్ లాబుస్‌చాగ్నే, మిచెల్ మార్ష్, ÷-లగెన్ మాక్స్‌వెల్, మ్యై రిచర్డ్‌సన్, స్టీవ్ స్మిత్, మిచెల్ స్టార్క్, మార్కస్ స్టోనిస్ వార్నర్, ఆడమ్ జంపా

మహిళల టి ట్వంటీ ఫైనల్స్

టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆస్ట్రేలియా

కేప్‌టౌన్, ఫిబ్రవరి 23 (సమ సమాజం): మహిళల టీ20 ప్రపంచకప్‌లో భాగంగా భారత్,ఆస్ట్రేలియా జట్ల మధ్య సెమీ ఫైనల్ మ్యాచ్ కేప్‌టౌన్‌లో ప్రారంభం అయ్యింది. టాస్ గెలిచిన ఆసీస్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. మ్యాచ్‌కు ముందు భారత జట్టుకు ఎదురుదెబ్బ తగిలింది. అనారోగ్యం కారణంగా పేసర్ పూజా వస్త్రాకర్ జట్టుకు దూరం కాగా, ఆమె స్థానంలో స్నేహ్ రాణా జట్టులోకి వచ్చింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కూడా కొంత అస్వస్థతకు గురైనప్పటికీ కోలుకోవడంతో తుదిజట్టులోకి వచ్చింది. భారత జట్టుకు ఇది కొంత శుభవార్తే. అలాగే, రాజేశ్వరి గైక్వాడ్ స్థానంలో రాధా యాదవ్ తుది జట్టులోకి రాగా, దేవిక స్థానంలో యస్తికా భాటియా తుది జట్టులోకి వచ్చింది. ఇక, ఆస్ట్రేలియా జట్టులో రెండు మార్పులు చోటు చేసుకున్నాయి. అలన కింగ్ స్థానంలో జెస్ జోనాసెన్, అన్నాబెల్ సుథెర్‌లాండ్ స్థానంలో అలిస్సా హీలీ జట్టులోకి వచ్చారు. కాగా, 2016 నుంచి టీ20 ప్రపంచ కప్‌లో ఆస్ట్రేలియాను ఓడించిన ఏకైక జట్టు టీమిండియానే. 2020, 2018 ఎడిషన్‌లో రెండుసార్లు గ్రూప్ స్టేజ్‌లో ఆస్ట్రేలియాను భారత జట్టు చిత్తు చేసింది. ఇప్పుడు కూడా అదే రికార్డును నిలబెట్టుకుని ఫైనల్‌కు దూసుకెళ్లాలని హర్మన్ సేన పట్టుదలగా ఉంది.

పేసర్ ఉమేశ్ యాదవ్ ఇంట విషాదం

తండ్రి తిలక్ యాదవ్ కన్నుమూత

నాగ్‌పూర్, ఫిబ్రవరి 23 (సమ సమాజం): టీమిండియా పేసర్ ఉమేశ్ యాదవ్ ఇంట విషాదం చోటుచేసుకుంది. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన తండ్రి తిలక్ యాదవ్ కన్నుమూశారు. ఆయన వయసు 74 సంవత్సరాలు. ప్రొఫెషనల్ రెజ్లర్ అయిన తిలక్ యాదవ్.. వెస్ట్రన్ కోల్‌ఫీల్డ్‌లోనూ పనిచేశారు. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భాగంగా జరుగుతున్న టెస్టు సిరీస్‌కు ఉమేశ్ యాదవ్ ఎంపికైనప్పటికీ తొలి రెండు టెస్టుల్లోనూ బెంచ్‌కే పరిమితమయ్యాడు. తిలక్ యాదవ్ మృతితో ఉమేశ్ యాదవ్ కుటుంబం విషాదంలో కూరుకుపోయింది. విషయం తెలిసిన టీమిండియా క్రికెటర్లు, అభిమానులు సంతాపం తెలుపుతూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. రెండో టెస్టు ముగిసిన వెంటనే ఉమేశ్ ఇంటికి చేరుకున్నాడు. ఆసీస్‌తో మార్చి 1న ఇండోర్‌లో మూడో టెస్టు ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంతో సెలక్షన్‌కు ఉమేశ్ అందుబాటులో ఉండే అవకాశం ఉందని తెలుస్తోంది. అయితే, తుది జట్టులో చోటు దక్కే అవకాశం ఉమేశ్ యాదవ్‌తో పోలిస్తే మహమ్మద్ సిరాజ్, మహమ్మద్ షమీలకే ఎక్కువ చాన్స్ ఉంది. మూడో టెస్టులో కనుక పరిస్థితులు భారత్‌కు అనుకూలంగా ఉంటే అప్పుడు భారత జట్టు ముగ్గురు స్పిన్నర్లతో బరిలోకి దిగుతుంది. అదే జరిగితే మూడో టెస్టులోనే ఉమేశ్ బెంచ్‌కు పరిమితం కాక తప్పదు.

సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు కొత్త కెప్టెన్

దక్షిణాఫ్రికా బ్యాటర్ ఐడెన్ మార్కరమ్‌కు పగ్గాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (సమ సమాజం): ఐపీఎల్ 2023కి సమయం దగ్గరపడుతోంది. ఫ్రాంచైజీలు జట్ల కూర్పును ప్రారంభించాయి. ఈ నేపథ్యంలో తాజాగా సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు కొత్త కెప్టెన్‌ను నియమించుకుంది. దక్షిణాఫ్రికా బ్యాటర్ ఐడెన్ మార్కరమ్‌కు జట్టు పగ్గాలు అప్పగించింది. దక్షిణాఫ్రికా టీ20 లీగ్ 'ఎస్ఏ-20'లో ఎస్ఆర్‌హెచ్ సిస్టర్ ఫ్రాంచైజీ 'సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్'కు మార్కరమ్ సారథ్యం వహిస్తున్నాడు. ఈ టోర్నీలో మార్కరమ్ జట్టుకు టైటిల్‌ను అందించాడు. ఈ నేపథ్యంలోనే ఇప్పుడు ఎస్ఆర్‌హెచ్‌కు కూడా అతడినే కెప్టెన్‌గా నియమించింది. గత సీజన్‌లో జట్టుకు సారథ్యం వహించిన కేన్ విలియమ్సన్‌ను ఇటీవల జరిగిన వేలంలో డిఫెండింగ్ చాంపియన్ గుజరాత్ టైటాన్స్ దక్కించుకుంది. ఈ నేపథ్యంలో కొత్త కెప్టెన్ కోసం వెతికిన హైదరాబాద్ 29 ఏళ్ల మార్కరమ్‌కే పగ్గాలు అప్పగించింది. విలియమ్సన్ మొత్తం మూడు సీజన్లలో జట్టును నడిపించాడు. మయాంక్ అగర్వాల్ సహా కెప్టెన్సీ కోసం పలువురు పోటీ పడినా చివరికి అది మార్కరమ్‌నే వరించింది. 'ఎస్ 20' ఫైనల్‌కు ముందు మార్కరమ్ మాట్లాడుతూ.. ఎస్ఆర్‌హెచ్ కెప్టెన్సీపై ఆసక్తి కనబరిచాడు. ఏం జరుగుతుందో తెలియదని, కాకపోతే మేనేజ్‌మెంట్ నిర్ణయానికి కట్టుబడి ఉంటామని పేర్కొన్నాడు. కెప్టెన్సీ అనేది చాలా గొప్పదని, తాను ఇప్పటికే కెప్టెన్సీ రోల్‌లో ఉన్నాను కాబట్టి దానిని నిర్వహించడం బాగుంటుందని చెప్పుకొచ్చాడు.

సీరియస్ నటనలో రాటుదేలిన అల్లరి నరేశ్

ఈవీవీ వారసుడిగా డైరెక్టర్ గా కాకపోయినా తన సినిమాలతో ఆడియన్స్‌ని అలరిస్తూ వస్తున్నాడు అల్లరి నరేష్. తన మొదటి సినిమా అల్లరి నుంచి అతను చేసిన ప్రతి సినిమా ప్రేక్షకులను నవ్విస్తూ వచ్చింది. పేరడీ కామెడీ సినిమా స్పూఫ్ లు ఇలా అల్లరోడు సినిమా అంటే ఎంచక్కా వెళ్లి హాయిగా నవ్వుకుని రావొచ్చు అన్న టాక్ వచ్చింది. అయితే రొటీన్ గా అవే సినిమాలు చేస్తుండటం వల్ల అతను సినిమాలు ఆడియన్స్ కి బోర్ కొట్టేశాయి. ఇక పంథా మార్చాల్సిన టైం వచ్చేసిందని ఫిక్స్ అయిన అల్లరి నరేష్ సీరియస్ కథలతో సినిమాలు చేయాలని ఫిక్స్ అయ్యాడు. ఈ క్రమంలో నాంది సినిమాతో సక్సెస్ అందుకున్న నరేష్ ఇక మీదట కామెడీ సినిమాలు కాదు సీరియస్ కథలతోనే మూవీస్ చేయాలని అనుకున్నాడు. అందుకే వరుస అలాంటి సినిమాలతోనే వస్తున్నాడు. ఈమధ్య వచ్చిన ఇట్లు మారేడుమిల్లి సినిమా కూడా నరేష్ సీరియస్ కథతోనే వచ్చాడు. కానీ ఆ సినిమా ఆడియన్స్ కి రుచించలేదు. అందుకే తనకు నాంది లాంటి హిట్ అందించిన డైరెక్టర్ విజయ్ కనకమేడల డైరెక్షన్ లోనే ఉగ్రం అంటూ సినిమా చేస్తున్నాడు. ఈ సినిమా టీజర్ తోనే సినిమా ఎలా ఉంటుందో చూపించారు. ఉగ్రం సినిమాలో నరేష్ తన ఉగ్ర రూపం చూపించాడని తెలుస్తుంది. టీజర్ రిలీజ్ టైం లో మాట్లాడుతూ ఇక మీదట అల్లరి నరేష్ లో అల్లరి ఉండదని వరుస సీరియస్ కథలనే చేస్తానని మరోసారి గుర్తుచేశాడు నరేష్. అతన్ని ఆడియన్స్ కు దగ్గర చేసింది అతని అల్లరి. కానీ ఇక మీదట అలాంటి సినిమాలు చేయనని చెప్పి షాక్ ఇచ్చాడు నరేష్. అయితే కథ డిమాండ్ చేసి ష్యూర్ షాట్ హిట్ పక్కా అనిపించే కామెడీ కథలను నరేష్ ఓకే చేసే అవకాశం ఉంది. కానీ మెంటల్ గా మాత్రం ఇక మీదట అల్లరి నరేష్ కనిపించడు నాంది నరేష్ మాత్రమే కనిపిస్తాడని గట్టిగా చెబుతున్నాడు. నరేష్ లో ఈ మార్పు మంచిదే అని కొందరు ఆడియన్స్ అంటున్నా. ఎప్పుడూ సీరియస్ కథలే కాకుండా తనని ఆడియన్స్ కు దగ్గర చేసిన కామెడీ ఎంట్టంల్గ÷నింగ్ స్టోరీస్ కూడా చేస్తే బాగుంటుందని కొందరి అభిప్రాయం. ఏది ఏమైనా నరేష్ నిర్ణయం అతని కెరీర్ ని ఎలా తీసుకెళ్తుందో చూడాలి. ఉగ్రం సినిమా టీజర్ వరకు బాగానే అనిపించినా అసలు మ్యాటర్ ఏంటన్నది సినిమా వస్తేనే కానీ చెప్పలేం.

మగధీర రీ రిలీజ్‌కు సన్నాహాలు

చిరుత సినిమాతో సినీ రంగంలో అడుగు పెట్టిన మెగా పవర్ స్టార్ రాం చరణ్ గురించి తెలుగు సినీ ప్రేక్షకులకు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అయితే మెగాస్టార్ కొడుకుగానే చత్రసీమకు పరిచయం అయినా రెండో సినిమాతోనే సూపర్ డూపర్ హిట్టు కొడతాడని ఏఎరూ అనుకోలేదు. కానీ చెర్రీ తన రెండో సినిమాతోనే సినీ ఇండస్ట్రీ రికార్డులు తిరగరాశాడు. అందులోనే డైలాగ్ లు పాటలు అంటే అభిమానులకు ఇప్పటికీ ఇష్టమే. రాజమౌళి రామ్ చరణ్ కాంబోలో వచ్చిన మగధీర సినిమా 2009 జులై 31వ తేదీన విడుదలైంది. పదమూడేళ్ల క్రితం సినిమా గురించి ఇప్పుడు ఎందుకు చెబుతున్నామా అనే డౌట్ వస్తోందా. ఇందకూ ఓ కారణం ఉందండి. అదేంటంటే.. ఈ సూపర్ డూపర్ హిట్టు సినిమాను లీ రిలీజ్ చేయబోతు న్నారు. మెగా పవర్ స్టార్ రాం చరణ్ పుట్టిన రోజు సందర్భంగా మార్చి 17వ తేదీన ఈ చిత్రాన్ని థియేటర్లలోకి తీసుకురాబోతున్నారు. మరోసారి కాలభైరవ మిత్రవిందల ప్రేమ కథను థియేటర్లలో చూసేందుకు ప్రేక్షకులు కూడా తెగ ఆసక్తి చూపిస్తున్నారు. సినిమా రీరిలీజ్ గురించి తెలిసినప్పటి నుంచి పుల్ ఖుషీ చేస్తున్నారు. అయితే అల్లు అరవింద్ నిర్మాణంలో దర్శకధీరుడు రాజమౌళి డైరెక్షన్ లో వచ్చిన ఈ సినిమాలో రామ్ చరణ్ పక్కన కాజల్ అగర్వాల్ హీరోయిన్ గా నటించింది. నటుడు శ్రీహరి కీలక పాత్రలో నటించి మెప్పించారు. ఈ సినిమాకు కథను డైరెక్టర్ రాజమౌళి తండ్రి విజయేంద్ర ప్రసాద్ అందించారు. అలాగే ఎం రత్నం మాటలు రాశారు. ఆల్ టైం హిట్టుగా నిలిచిన పాటలను భువన చంద్ర చంద్రబోస్ కీరవాణిలు సమకూర్చారు. మగధీర సినిమా 13 ఏళ్ల కిందనే 40.42 కోట్ల థియేట్రికల్ బిజినెస్ చేసింది. మొత్తంగా రూ.77.96 కోట్ల షేర్ వసూళ్లను రాబట్టి అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. ఈ సినిమా బయ్యర్లకు 37.54 కోట్ల భారీ లాభాలను అందించింది. మరోసారి ఈ చిత్రాన్ని థియేటర్లలో విడుదల చేసేందుకు అంతా ఆసక్తి చూపిస్తున్నారు. అయితే రెండో సారి రిలీజ్ కాబోతున్న ఈ చిత్రం ఏ మేర వసూలు చేస్తుంది ఎన్ని థియేటర్లలో విడుదల అవుతుంది వంటి విషయాలు తెలియాలంటే ఇంకా కొంత కాలం ఆగాల్సిందే.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in